క్లుప్తంగా...

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



నిజాంపేట్: మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మేయర్‌కు ఆహ్వానం



నిజాంపేట్: మాజీ మేయర్ నీలా గోపాల్ రెడ్డిని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. నిజాంపేట్‌లో జరిగే పాత పెద్దమ్మ దేవతా పునఃప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేయాలని వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రుక్కారెడ్డి, జనార్ధన్ రెడ్డి, రాజ్‌మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిరాణ షాపులో చోరీ

జగద్గిరిగుట్ట : కిరాణ షాపులో తాళాలు పగలగొట్టి నగదు దొంగిలించిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ నగర్ మీ సేవ పక్కనే ఉన్న శ్రీలక్ష్మి గణేష్ కిరాణా దుకాణంలో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కౌంటర్‌లోని రూ.13 వేల చోరీ చేశారు. షాపు యజమాని మహేందర్ రోజు లాగే షాపు తెరవడానికి మంగళవారం రాగా తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు ముమ్మరం

- 10 వాహనాల్లో వైర్ల తరలింపు
- ఏదైనా ఘటన జరిగినప్పుడే హడావుడి
- గతంలో నోటీసులతోనే సరి



కేబుల్ వైర్లను తొలగిస్తున్న సిబ్బంది



డీఈ జాన్ పోతురాజు, సర్కిల్ కమిషనర్ నర్సింహ ఆధ్వర్యంలో వైర్లను తొలగిస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: విద్యుత్ వైర్లు తెగిపడి పలువురు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు కళ్లు తెరిచారు. రెండు రోజుల క్రితం రామంతపూర్‌లో జరిగిన ఘటనలో ఆరుగురు మృతి చెందిన విషయం పై సీఎండీ ముషారఫ్ ఆదేశాలతో టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను మేడ్చల్ డీఈ జాన్ పోతురాజు ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట, గాజులరామారం, చింతల్, కుత్బుల్లాపూర్, కొంపల్లి, వెన్నెలగడ్డ, సుభాష్ నగర్, పేట్ బషీరాబాద్ ఇంజనీరింగ్ సెక్షన్ల పరిధిలో ఎక్కడికక్కడే స్తంభాలకు ఉన్న వైర్లను తొలగించి అక్కడి నుంచి తరలించారు. సుమారు 10 వాహనాల్లో ఈ కత్తిరించిన కేబుల్ వైర్లను మేడ్చల్ డీఈ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు తొలగించడంతో ఆయా ప్రాంతాల్లో సేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా మేడ్చల్ శామీర్‌పేట్ డివిజన్‌లో సైతం విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగిస్తున్నట్లు డీఈ తెలిపారు.

ప్రాణం పోతేనే స్పందిస్తారా?

మేడ్చల్ డీఈ పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎటువంటి అనుమతులు లేకుండా టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు వేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు హవా కొనసాగిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో రామంతపూర్ ఘటన అధికారుల కళ్లు తెరిపించింది. విద్యుత్తు స్తంభానికి ఉన్న కేబుల్ వైర్ ఈ ఘటనకు కారణమని తేలడంతో వాటిపై దృష్టి సారించారు. గతంలో ఉన్న అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. మరి కొంత మంది కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్‌నెట్ సంస్థ ప్రతినిధుల నుంచి లంచాలు తీసుకొని వదిలేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం కరెంటు లైన్ లేదా స్తంభాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి 18 అడుగుల పైనే కేబుల్ ను వేసుకోవాలి. కానీ అవి ఏమీ పట్టించుకోకుండా చేతికి అందే దూరంలోనే వేసుకుంటూ పోయారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోయాయి. ఏది ఏమైనప్పటికీ రామంతపూర్‌లో జరిగిన ఘటనలో పలువురు మృతి చెందగా.. అధికారులు తీరుని చూస్తుంటే ఎవరైనా చనిపోతేనే స్పందిస్తారా..! అన్న సందేహం కలుగుతుంది.

బాధ్యులు ఎవరు.. బాధ్యత ఎవరిది..!

విద్యుత్ సిబ్బందికి తెలియకుండా కేబుల్ వైర్లు స్తంభాలకు ఏర్పాటు చేస్తుంటే ఇన్ని రోజులు చూసిన అధికారులు... తాజాగా స్పందిస్తున్న తీరుపై అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ వైర్లు అడ్డుగా ఉన్నాయని అధికారులకు ఫోన్ చేసినా..! సమాచారం ఇచ్చినా ..ఫిర్యాదు చేసినా.. పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కేబుల్ ఏర్పాటు విషయంలో కొంతమంది స్థానిక లైన్‌మెన్‌లు, అధికారుల అండదండలతో మామూలు వసూలు చేసినట్లు తెలిసింది. చిన్నచిన్న గల్లీలు మొదలుకొని రహదారుల వెంట కేబుళ్లను రోడ్డుకు అడ్డంగా లాగుతున్న క్రమంలో అందులో పనిచేసే వ్యక్తులు సైతం విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రమాదాలపై బాధ్యులు ఎవరు?, బాధ్యత ఎవరిది అన్నదే ఇప్పుడు ప్రశ్నగా మారింది.

వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్



చెన్నం చెరువు నుంచి వెళ్లే కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్

దుండిగల్: వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని చెన్నం చెరువు అలుగు నుంచి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన మంగళవారం తమ సిబ్బందితో చెన్నం చెరువును పరిశీలించారు. జేసీబీ సాయంతో అక్కడక్కడ మరమ్మతులు చేపట్టారు. స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో ఎక్కడైనా వర్షపు నీరు ఎక్కువగా నిలువ ఉన్నా, చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగి పడిపోయినా, పురాతన ఇల్లు కూలిపోయే పరిస్థితిలో ఉన్నా, కరెంటు తీగలు, స్తంభాలు విరిగిపోయే ప్రమాద పరిస్థితుల్లో మున్సిపల్ మాన్‌సూన్ హెల్ప్ డెస్క్ నెంబర్ 7995824443 ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ బి సురేందర్ నాయక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: బాచుపల్లి అంబేడ్కర్ కాలనీ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ నాయకులు మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి అంబేడ్కర్ కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బాచుపల్లి 18, 19వ డివిజన్‌లలో అంబేడ్కర్ కాలనీ శ్మశాన వాటిక కబ్జాకు గురి అవుతుందన్నారు. కబ్జా నుంచి శ్మశాన వాటికను పరిరక్షించి, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని కోరారు. అదేవిధంగా శ్మశానవాటికలో వసతులు కల్పించాలని కోరారు. రేణుకా ఎల్లమ్మ టెంపుల్ రోడ్డు అస్తవ్యస్తంగా తయారై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదయ్య, కర్రె నవీన్, కె.ఆంజనేయులు, బైండ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు



విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు

చింతల్: విద్యార్థులు పాఠశాల దశ నుంచే ప్రతిభ చాటాలని రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ కళాశాల చైర్మన్ ఏ శాంతికుమార్ యాదవ్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ జూనియర్ కళాశాల, ఏపీవై ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో కళాశాల క్యాంపస్‌లో వ్యాస రచన, జామ్, డ్రాయింగ్, గానం, నత్యం తదితర రంగాలలో పోటీలు నిర్వహించారు. 50 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ శాంతి కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో హోమం



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధి మగ్దూంనగర్‌లోని మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కరుణ గోపాల్, సుజీత్ కుమార్, సోమశేఖర్, అర్జున్, కిషన్, పవన్, చంద్ర శేఖర్, శ్యామ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం స్వాధీనం



కృష్ణ(ఫైల్)

దుండిగల్: చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లంపేటలోని 50 గజాల ప్రాంతానికి చెందిన తలారి కృష్ణ (54) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. తరుచూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నెల 17న ఉదయం 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో గొడవ పడి కృష్ణ తన ఫోన్‌ను ఇంట్లోనే పెట్టి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మంగళవారం ఉదయం మల్లంపేటలోని కత్వ చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కృష్ణదిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.